సాక్షి నల్లగొండ

సోమవారం । 26 । ఫిబ్రవరి । 2024



దర్శనానికి మూడున్నర గంటలు
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి ఆదివారం మూడున్నర గంటల సమయం పట్టింది.
- 8లో



గంజాయి విక్రేత అరెస్ట్
కోదాడలో గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని పోలీసులు శనివారం రాత్రి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు.
- 8లో



ముగిసిన సెపక్‌తక్రా పోటీలు
నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో జూనియర్, సబ్ జూనియర్ అంతర్ జిల్లా సెపక్‌తక్రా పోటీలు ఆదివారం ముగిశాయి.
- 8లో

న్యూస్‌రీల్

నేడు నల్లగొండకు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం నల్లగొండకు రానున్నారు. ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి నల్లగొండకు చేరుకుంటారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను ప్రారంభించనున్నారు. 11.30 గంటలకు నల్లగొండ మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్న భోజనం తర్వాత తిరిగి మహాత్మాగాంధీ యూనివర్సిటీకి వెళ్లి జాబ్‌మేళాను పరిశీలిస్తారు. సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ వెళతారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ : సోమవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), తెలంగాణ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ స్కిల్ ఆధ్వర్యంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హరిచందన ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ జాబ్‌మేళాలో సుమారు 100కు పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని, సుమారు 5000 పైగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించనున్నాయని వెల్లడించారు. జాబ్‌మేళా హాజరయ్యే అభ్యర్థులు ఏదైనా డిగ్రీ, డిప్లొమా, పీజీ, ఫార్మా, ఎంబీఏ, ఎంసీఏలలో ఏదో ఒకటి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ధ్రువపత్రాలు, రెజ్యూమ్‌కు సంబంధించిన ఐదు జిరాక్స్ సెట్లతో హాజరుకావాలని సూచించారు.

ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీలో సోమవారం నిర్వహించనున్న జాబ్‌మేళా ఏర్పాట్లను అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదివారం పరిశీలించారు. ఉద్యోగ మేళాకు వచ్చే నిరుద్యోగులకు ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సీఈఓ గోనారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు సాగుతున్నాయి. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి కోటేశ్వర్‌రావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు, కాంగ్రెస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, రిజిస్ట్రార్ అల్వాల రవి, ప్లేస్‌మెంట్ అధికారి ప్రశాంతి, టాస్క్ మేనేజర్ ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ లీగ్ పోటీలు ప్రారంభం

నల్లగొండటూటౌన్ : మేకల అభినవ్ అవుట్ డోర్ స్టేడియంలో ఛత్రపతి శివాజీ ఫుట్‌బాల్ క్లబ్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సీఎస్ఎల్ ఫుట్‌బాల్ లీగ్ పోటీలను ప్రతి ఆదివారం జిల్లా క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగ్ పోటీల్లో పాల్గొనడం ద్వారా క్రీడాకారులకు అనుభవం పెరుగుతుందన్నారు. స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ బొమ్మపాల గిరిబాబు మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయిలో 8 - 16 సంవత్సరాలలోపు బాల బాలికలకు ఫుట్‌బాల్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే క్రీడాకారుల పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నానో క్రాప్ కేర్ ఏరియా డిస్ట్రిబ్యూటర్ బి.రాంప్రసాద్‌రెడ్డి క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ హెడ్ కోచ్ మద్ది కరుణాకర్, యావర్, మధు, మురళి, వెంకటసాయి, యశ్వంత్, యతిన్ పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనాలి

నల్లగొండ : బ్యాంకు ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనడం అవసరమని ఎస్‌బీఐ హైదరాబాద్ సీజీఎం రాజేష్‌కుమార్ అన్నారు. ఆదివారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జిల్లా జోనల్ కార్యాలయం ఆధ్వర్యంలో పరిపాలన కార్యాలయ స్థాయి క్రీడా పోటీలను నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో (షటిల్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చెస్), మేకల అభినవ్ స్టేడియంలో (క్రికెట్) ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల బ్యాంకు ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా చురుగ్గా తయారవుతారని తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం ప్రశాంత్ కుమార్, రీజనల్ మేనేజర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



తిప్పర్తికి చెందిన రైతు నూకల ప్రవీణ్ తనకున్న మూడెకరాల్లో రెండు బోర్ల ఆధారంగా వరి సాగు చేశాడు. ప్రస్తుతం ఆ బోర్లు వట్టిపోవడంతో కనీసం పెట్టిన పెట్టుబడి అయినా దక్కించుకుందామని మొన్నటివరకు ట్యాంక్ ద్వారా పొలానికి నీరు పెట్టాడు. ఇప్పుడు ట్యాంకర్లకు డిమాండ్ పెరగడంతో అవి కూడా దొరకడం లేదు. దీంతో ఆ రైతు దిక్కుతోచని స్థితిలో పడ్డాడు.



ఈ ఫొటో పాలకవీడు మండలం జాన్‌పహాడ్ గ్రామంలోనిది. గ్రామానికి చెందిన రైతు బొమ్మకంటి సైదులు. ఈ రైతు తనకున్న ఒక్క బోరు ఆధారంగా యాసంగిలో రెండకరాల్లో వరి సాగు చేశాడు. ప్రస్తుతం ఆ బోరు వట్టిపోవడంతో.. వరి చేను పూర్తిగా వాడుముఖం పట్టింది. దీంతో ఆ పొలంలో గొర్రెలు, పశువులను మేపుతున్నాడు.

అన్నదాత నీటిగోస

భూగర్భ జలాలు అడుగంటి ఎండుతున్న వరి చేలు

- కాలువల ద్వారా నీరు రాక ఆయకట్టు రైతు దిగాలు
- పశువులు, గొర్రెలకు మేతగా మారిన పొలాలు
- పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నాలు
- పెట్టుబడి పెరిగి అప్పుల పాలవుతున్న కర్షకులు



కనగల్ మండలం పగిడిమర్రిలో వాడుపట్టిన వరి చేనును పశువుల మేత కోసం కోస్తున్న మహిళ



కొండమల్లేపల్లి మండలంలో అడుగంటిన పేర్వాల జలాశయం

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో కరువు ఛాయలు అలుముకున్నాయి. వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటడంతో సాగుకు నీరందడంలేదు. దీంతో ఈ యాసంగిలో సాగు చేసిన పంటలో సగం వరకు ఎండిపోయి పశువులకు మేతగా మారుతోంది. సాగర్ ఆయకట్టులోనూ ఇదే పరిస్థితి ఉంది. సాగర్ ఎడమకాల్వ ద్వారా ఒక్క తడైనా నీళ్లు వస్తాయనకున్న రైతుల ఆశలు అడియాశలయ్యాయి. చేతికొచ్చే దశలో పంటలు ఎండిపోతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.



కనగల్ మండలం జి.చెన్నారంలో పంటను కాపాడుకునేందుకు బోరు వేస్తున్న రైతు

నీటి కోసం భగీరథ ప్రయత్నం

భూగర్భ జలాలు అడుగంటడంతో వందల ఎకరాల్లో పొట్ట దశలో ఉన్న వరి చేలు ఎండి పోతున్నాయి. చేతికొచ్చే దశలో ఉన్న పంటను కాపాడుకునేందుకు కొందరు రైతులు అదనంగా బోర్లు వేస్తున్నారు. మరి కొందరు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. వేసిన బోర్లు పడకపోవడం, ట్యాంకర్ల కిరాయిలు రైతులపై అదనపు భారంగా మారాయి. దీంతో పెట్టుబడులు తడిసి మోపెడవుతున్నాయి.

గణనీయంగా పడిపోయిన భూగర్భ జలాలు

జిల్లాలో గతేడాది జనవరిలో 5.27 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు.. ఈసారి జనవరిలో 8.68 మీటర్ల లోతుకు పడిపోయాయి. గతేడాదితో పోల్చితే ఈసారి 3.40 మీటర్ల లోతుకు పోయాయి.

- నల్లగొండ జిల్లాలోని చందంపేట మండలంలో గతేడాది జనవరిలో 7.96 మీటర్లలో లోతులో నీళ్లు ఉండగా, ఈసారి జనవరిలో అవి 15.62 మీటర్ల లోతుకు పడిపోయాయి. ఆ తరువాత నేరెడుగొమ్ము మండలంలో గతేడాది 7.92 మీటర్ల లోతులో ఉండగా, ఈసారి అవి 12.85 మీటర్ల లోతుకు పడిపోయాయి.
- సూర్యాపేట జిల్లాలో గతేడాది జనవరిలో భూగర్భ జలాలు 4.49 మీటర్ల లోతులో ఉండగా, ఈసారి జనవరిలో 7.23 మీటర్ల లోతుకు పడిపోయాయి. మేళ్లచెరువు మండలంలో గతేడాది జనవరిలో 4.30 మీటర్లలో లోతులో నీరు ఉండగా, ఈ జనవరిలో 18.88 మీటర్ల లోతుకు పడిపోయాయి. తిరుమలగిరి మండలంలో 2.38 మీటర్ల లోతు నుంచి 13.50 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి.

అప్పుల పాలవుతున్న రైతులు

నల్లగొండ జిల్లాలో యాసంగిలో సాధారణ వరి సాగు 5.40 లక్షల ఎకరాలు కాగా, ఈసారి 4.20 లక్షల ఎకరాలకు తగ్గింది. సూర్యాపేట జిల్లాలో సాధారణంగా యాసంగిలో 4.60 లక్షల ఎకరాల్లో ఎకరాల్లో వరి సాగు అవుతుండగా, ఈసారి అది 3.81 లక్షల ఎకరాలకు తగ్గిపోయింది. సాగర్ ఆయకట్టులో సాగుకు నీటి విడుదల లేకపోవడంతో బోర్లు, బావుల ఆధారంగానే రైతులు వరి సాగు చేశారు. బోర్లు పోస్తాయని ఆశించి పంటలు సాగు చేసినా, భూగర్భ జలాలు పడిపోవడంతో బోర్ల నుంచి నీరు రావడం లేదు. దీంతో అప్పులు చేసి సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. పెట్టిన పెట్టుబడిని.. చెల్లించేందుకు రైతులు మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

దిక్కుతోచక పశువులను మేపుతున్నాం



సాగర్ నుంచి ఒక్కతడైనా నీళ్లు వస్తయనుకుని బోరు నీళ్లతో యాసంగిలో రెండు ఎకరాల్లో వరిసాగు చేశా. బోర్లలో నీళ్లు లేక, సాగర్ నీళ్లు రాక పొట్ట దశలో పంట మొత్తం ఎండి పోయింది. ఎండిన పొలాన్ని పశువులు, గొర్లను మేపుతున్నాం. మా చుట్టుపక్కల గ్రామాల రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

– బొమ్మకంటి సైదులు, రైతు, జాన్‌పహాడ్, పాలకవీడు మండలం

ఇప్పటికే సగం ఎండిపోయింది



బోర్ల ఆధారంగా ఏడెకరాల్లో వ్యవసాయం చేస్తున్నా. పక్కనే పేర్వాల రిజర్వాయర్ ఉండటంతో భూగర్భ జలాలు బాగుండి గతంలో బోర్లు బాగా పోసేవి. ప్రస్తుతం జలాశయం అడుగంటింది. రెండు బోర్లలో ఒక బోరు పూర్తిగా వట్టిపోయింది. దానివల్ల సగం పొలం ఎండిపోయింది.

– మూడావత్ సీతారాం, సింగయ్య తండా, కొండమల్లేపల్లి మండలం

బావి పూడిక తీయించా



నాకు మూడున్నర ఎకరాల పొలం ఉంది. పంట పొట్ట దశ కొచ్చిన సమయంలో నీరు బాగా అవసరం కావడంతో బావిలో పూడిక తీయించా. అయినా రోజూ రెండు గంటలకు మించి నీరు రావడం లేదు. పంట పెట్టుబడికి ఇప్పటికే రూ.60 వేలు ఖర్చయింది. పూడిక తీయించేందుకు రూ.25 వేలు అయ్యింది. ఈసారి పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

– కానుగు ముత్యాలు, గరిదేపల్లి

బక్కచిక్కుతున్న బాల్యం

- వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు పెరగడంలో లోపం
- పోషకాహారం అందక ఆరోగ్య సమస్యలు



అంగన్‌వాడీ కేంద్రంలో ఎత్తు చూస్తున్న కార్యకర్త

మిర్యాలగూడ టౌన్ : బాల్యం బక్క చిక్కుతోంది. ఆరోగ్యంగా ఉండాలంటే.. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ఎంతో అవసరం. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సరైనా పోషకాహారం తీసుకోకపోవడం వల్ల అనేక రుగ్మతలకు గురవుతారు. ప్రధానంగా చిన్నారులు తక్కువ బరువు, వయస్సుకు తగిన ఎత్తుకు లేకపోవడం, తదితర ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు గుడ్లు, పాలు, బాలామృతం, మధ్యాహ్న భోజనం చిరుతిండ్లు అందిస్తున్నా.. ఇంకా చాలా మంది పిల్లలు పోషకాహార లోపంతో బాధపడడం ఆందోళన కలిగిస్తోంది. పోషకాహార లోపం వల్ల చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి తగ్గి ఆనారోగ్యం కలిగించే పలు రకాల వైరస్‌లు వారి సోకే ప్రమాదం ఉంది. మంచి ఆహారంతోనే చిన్నారులు శారీరకంగా ఎదుగుతారని వైద్యులు పేర్కొంటున్నారు.

జిల్లాలో ఆరేళ్లలోపు చిన్నారుల వివరాలు..

0 నుంచి 6నెలలు	9,281
7నెలల నుంచి 1 సంవత్సరం	9,347
1 నుంచి 3 ఏళ్లలోపు	34,301
3 నుంచి 6 ఏళ్లలోపు	22,442
తక్కువ బరువు ఉన్న చిన్నారులు	329
పోషకాహార లోపం ఉన్న వారు	182
వయస్సుకు తగిన ఎత్తు లేనివారు	1980

కారణాలు ఇలా..

పిల్లలో పోషకాహార లోపానికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ కుటుంబాల్లో పేదరికం, ఆహారంపై అవగాహన లేకపోవడంతో చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదు. వ్యవసాయ పనులు, కూలికి వెళ్లేవారు పిల్లలను ఇంటివద్ద వదిలేసి వెళ్తుతుండటంతో వారికి సరైన ఆహారం లేక ఆకలితో అలమటించే పరిస్థితి ఉంది. వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కేంద్రాలపై ఉంది.

అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం..

నల్లగొండ జిల్లాలో అనుముల, చింతపల్లి, దామరచర్ల, దేవరకొండ, కొండమల్లేపల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, మునుగోడు, నకిరేకల్ ప్రాజెక్టుల పరిధిలో 2,093 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఆరేళ్లలోపు పిల్లలు 75,371 మంది , గర్భిణులు 17,770 మంది, బాలింతలు 17,779 మంది ఉన్నారు. వీరందరికీ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందుతోంది. అయితే అంగన్‌వాడీ కేంద్రాలకు రాని పిల్లలకు కూడా పౌష్టికాహారం అందే విధంగా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెడతాం



పోషకాహార లోపంతో బాధపడుతున్నవారిపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నాం. వారికి ఎక్కువ పోషక విలువలు కలిగిన బాలామృతం ప్లస్ అందిస్తాం ప్రతి నెలా గ్రోత్ కార్డుల ద్వారా తక్కువ బరువు, వయస్సుకు తగిన ఎత్తులేని వారిని గుర్తించి సరైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. పోషక విలువల కోసం ఎలాంటి ఆహారం తీసుకోవాలో అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. తీవ్రమైన పోషకలోపం ఉన్న వారికి వైద్య సేవలను అందించేలా చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సక్కుబాయి, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారిణి, నల్లగొండ

తాగునీటి ఎద్దడిని నివారించాలి



దామరచర్లలో ఎండిపోయిన చెరువును మోకాళ్లపై ఉండి పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : సాగర్ ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటలను నింపి తాగునీటి ఎద్దడిని నివారించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. ఆదివారం దామరచర్ల మండల కేంద్రంలోని చెరువులను ఆయన పరిశీలించి మాట్లాడారు. వేసవికాలం ప్రారంభంలోనే నీళ్ల లేక చెరువులు, కుంటలు ఎండిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎడమకాల్వ ద్వారా నీటిని విడుదల చేయకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి బోరుబావుల కింద సాగు చేసిన పంటలు ఎండిపోయాయన్నారు. ఎండిపోయిన పంటలను రెవెన్యూ, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, వినోద్ నాయక్, పాపానాయక్, దయానంద్, ఎర్రనాయక్, కోటిరెడ్డి, సుబాని, పాక గోపి, వెంకట్‌రెడ్డి, విజయ్, రవి, బాలు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు.. సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం శ్రీస్వామి, అమ్మవారికి నిజాభిషేకం, అర్చన నిర్వహించారు. అలాగే ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవారి జోడు సేవలను ఊరేగించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

క్లాక్‌టవర్‌కు మళ్లీ మువ్వన్నెల శోభ



జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో ఆదివారం జాతీయజెండా రెపరెపలాడింది. జాతీయ జెండా లేకపోవడంతో 'కళ తప్పిన క్లాక్‌టవర్' శీర్షికన ఈ నెల 23వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన ఫొటో కథనానికి అధికారులు స్పందించి నూతన జెండా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనగణమన ఉత్సవ సమితి కార్యదర్శి కొలనుపాక రవికుమార్ 'సాక్షి'కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

సాక్షి ఎఫెక్ట్..

రైతుబంధుపై కదలిక

- కొందరు రైతులకు అందని యాసంగి పెట్టుబడి సాయం
- సీజన్ ముగియడంతో ఇక రావని నిరాశ
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు



నల్లగొండ అగ్రికల్చర్ : యాసంగి రైతుబంధుపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సీజన్ ముగిసినప్పటికీ కేవలం 3 ఎకరాలలోపు రైతుల ఖాతాల్లో మాత్రమే రైతుబంధు డబ్బులను జమచేసింది. మూడెకరాలపైగా ఉన్న రైతులకు రైతుబంధు జమ కాకపోవడంతో వారంతా ఆశలు వదులుకున్నారు. ఇటీవల కోస్గిలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రైతుబంధు పథకం డబ్బులు పడని రైతులందరికీ మార్చి 15వ తేదీలోగా జమచేస్తామని ప్రకటించారు. దీంతో రైతుబంధు సాయం రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

గతేడాది డిసెంబర్ 12న ప్రారంభం

యాసంగి సీజన్ రైతుబంధు పథకం డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 12 నుంచి రైతుల ఖాతాల్లో జమచేస్తోంది. గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఎకరానికి రూ.5 వేల చొప్పున జమ చేస్తోంది. డబ్బులు జమ చేసే ప్రక్రియను ప్రారంభించి ఇప్పటికి 72 రోజులు గడుస్తున్నా కేవలం మూడెకరాలోపు రైతుల ఖాతాల్లోనే డబ్బులు పడ్డాయి. ఆపైన భూమి ఉన్న రైతులకు డబ్బులు జమ కాలేదు.

5,42,106 మంది రైతులు అర్హులు

జిల్లాలో మొత్తం 5,42,106 మంది రైతులు రైతుబంధు పథకానికి అర్హులు ఉన్నారు. వారికి రూ.624 కోట్ల 15 లక్షలు జమచేయాల్సి ఉంటుంది. అందులో బ్యాంకు డిటైల్స్ అప్‌గ్రేడ్ చేయించుకున్న రైతులు 5,12,352 మంది ఉన్నారు. వీరిలో 4,72,502 మంది రైతులకు సంబంధించి రూ.434,53,74,323 జమ చేయడానికి ప్రభుత్వం ట్రెజరీకి పంపింది. ఇప్పటి వరకు 3,83,329 మంది రైతులకు మాత్రమే రూ.261,80,07,903 జమచేశారు. ఇంకా 1,32,023 మంది రైతులకు సంబంధించిన డబ్బులు సుమారు రూ.363 కోట్లు రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేయాల్సి ఉంది. ఇందులో మూడెకరాలకుపైగా ఉన్న రైతులందరూ ఉండడం విశేషం.

దశల వారీగా జమచేస్తాం



రైతుబంధు డబ్బులు దశల వారీగా రైతుల ఖాతాల్లో జమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ రైతుబంధు డబ్బులను జమ చేస్తుంది. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. యాసంగి సీజన్ డబ్బులు అందరికీ అందుతాయి.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ

ముగిసిన సమ్మక్క - సారలమ్మ జాతర

పెద్దవూర : మండలంలోని పొట్టిచల్మ ఎక్స్ రోడ్డు వద్ద కృష్ణానది తీరంలో చిన్న మేడారంగా పిలువబడుతున్న సమ్మక్క–సారలమ్మ జాతర ఆదివారం తెల్లవారు జామున ముగిసింది. మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహించే సమయంలోనే ఇక్కడ కూడా జాతర నిర్వహిస్తుంటారు. శనివారం సాయంత్రం దేవతలను వనప్రవేశం చేయించారు. ఆదివారం సమీప గ్రామాల ప్రజలు వన దేవతలను సందర్శించి మొక్కులు సమర్పించుకున్నారు. సమ్మక్క–సారలమ్మలను, గద్దెల సమీపంలోని పుట్టను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారులు గుంజ అంజమ్మ, గుంజ కృష్ణంరాజు, నాగపురి లక్ష్మీ, భక్తులు కర్నాటి లక్ష్మారెడ్డి, రేణుక తదితరులు పాల్గొన్నారు.



సమ్మక్క-సారలమ్మలకు పూజలు చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత

రామగిరి(నల్లగొండ): పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వారిపై తిప్పర్తి పోలీసులు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. నకిరేకల్ మండలం తాటికల్లుకు చెందిన ఉపేందర్ తిప్పర్తి మండలం మామిడాలతో పాటు చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి కొనుగోలు చేసిన 25 క్వింటాళ్ల బియ్యాన్ని బొలేరో వాహనంలో తరలిస్తుండగా ఆదివారం ఉదయం తెల్లవారుజామున మామిడాల స్టేజీ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి ఉపేందర్‌తో పాటు మొగిలి నాగరాజు, మాదగోని సాయికుమార్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి.రాజు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి

చౌటుప్పల్ : మండల పరిధిలోని పంతంగి గ్రామ శివారులో ఆరెగూడెం స్టేజీ వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా కోడూరు మండలం సమ్మలూరు గ్రామానికి చెందిన కోన లోకేష్(24) సోదరి హైదరాబాద్ శివారులోని షాపూర్‌లో నివాసం ఉంటుంది. అక్కడే ఆమె నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహప్రవేశం ఉండడంతో లోకేష్ స్వగ్రామం నుండి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఆ క్రమంలో శనివారం అర్ధరాత్రి మండల పరిధిలోని ఆరెగూడెం స్టేజీ వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టుగా డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి సోదరుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


కమిలి (ఫైల్)

కొండమల్లేపల్లి : విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల పరిధిలోని వద్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని కారోబార్‌తండాలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. కారోబార్‌తండాకు చెందిన నేనావత్ కమిలి(45) భర్త హేమ్లతో కలిసి వారికున్న రెండు ఎకరాలను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం సాయంత్రం వ్యవసాయ పొలంలో యూరియా చల్లి తిరిగి ఇంటికి వస్తుండగా వ్యవసాయ పొలంలో గాలికి కిందికి వేలాడుతున్న 11కె.వి విద్యుత్ తీగలు తగలడంతో కమిలి అక్కడికక్కడే మృతి చెందింది. రాత్రి వరకు భార్య ఇంటికి రాకపోవడంతో భర్త హేమ్లతో పాటు గ్రామస్తులు కమిలి కోసం గాలింపు చేపట్టారు. కాగా వ్యవసాయ పొలంలో విగత జీవిగా ఉన్న కమిలిని ఆమె ఇద్దరు కుమారులు, కుమార్తె, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త హేమ్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

పూర్వగిరిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు


ప్రధాన కలశాన్ని తీసుకెళ్తున్న ప్రధానార్చకులు, ఈఓ తదితరులు


హోమం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: పూర్వగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏడు రోజుల పాటు వైభవంగా కొనసాగిన వార్షిక బ్రహ్మోత్సవాలు అష్టోత్తర శతఘటాభిషేకంతో ముగిశాయి. ఈ నెల 19వ తేదీన స్వస్తి వాచనం, విశ్వక్సేన పూజతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఆదివారం శ్రీస్వామి అమ్మవార్లకు పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా శతఘటాభిషేకం గావించి ఉత్సవాలకు పరిసమాప్తి పలికారు. ఉదయం శ్రీవారి ఆలయంలో నిత్యారాధనల అనంతరం మూలవరులకు, ఉత్సవ మూర్తులకు అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. తొలుత ఆలయ ప్రధాన మండపంలో 108 కలశాలను ఒకే వద్దకు పెట్టి పూజించారు. ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధాన అర్చకులు, యాజ్ఞాచార్యులు, పారాయణికులు పాంచరాత్ర ఆగమరీత్యా ఈ వేడుకను జరిపించారు. అనంతరం కలశాల ఎదురుగా హోమం నిర్వహించి, పూర్ణాహుతి చేపట్టారు. ఈ వేడుకలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, అధికారులు, వేద పారాయణికులు తదితరులున్నారు. కాగా.. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రద్దు చేసిన నిత్య కల్యాణం, సుదర్శన నారసింహ హోమం వంటి పూజలు సోమవారం పునః ప్రారంభం కానున్నాయి.

గంజాయి విక్రేత అరెస్ట్

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో గంజాయి తాగుతూ, విక్రయిస్తున్న ఓ యువకుడిని పోలీసులు శనివారం రాత్రి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదివారం పట్టణ సీఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని భవానీనగర్‌కు చెందిన బొజ్జ అఖిల్‌కుమార్ హైదరాబాద్‌లో ఫార్మా-డి థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. అక్కడ గంజాయి తాగేందుకు అలవాటుపడ్డాడు. కోదాడ గణేష్‌నగర్‌కు చెందిన అతడి స్నేహితుడు అవిడి రాఘవకు కూడా గంజాయి తాగే అలవాటు ఉంది. దీంతో ఇద్దరు తరచూ పక్కనే ఉన్న ఏపీలోని జగ్గయ్యపేటకు వెళ్లి తక్కువ రేటుకు గంజాయి కొనుగోలుచేసి వారు కొంత తాగి మరికొంత బస్టాండ్‌లో అమ్మి వచ్చిన లాభాన్ని పంచుకునేవారు.

అరకేజీని రూ.3వేలకు కొనుగోలు చేసి

వారం రోజుల కిందట ఇద్దరు కలిసి జగ్గయ్యపేటలోని బొజ్జగాని రోహిత్ అలియాస్ లోబో దగ్గర అరకేజీ గంజాయిని రూ.3వేలకు కొనుగోలుచేసి ఎప్పటిలాగే కొంత తాగి మిగిలిన దానిని అఖిల్‌కుమార్ బస్టాండ్‌లో అమ్మేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఈ విషయం పోలీసులకు సమాచారం అందడంతో అతడిని అదులోకి తీసుకొని తనిఖీ చేయగా 270 గ్రాముల గంజాయితో పట్టుబడ్డాడు. స్టేషన్‌కు తరలించి విచారించగా నిజం ఒప్పుకున్నట్లు తెలిపారు. రాఘవ, రోహిత్‌లు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐలు రజింత్‌రెడ్డి, సిబ్బంది యల్లారెడ్డి, అశోక్, ఆంజనేయులు, సతీష్‌లు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో పూజలు


సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: రాష్ట్రంలోని తొలి సూర్యక్షేత్రమైన తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆది వారం ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు కాకులారపు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, భక్తులు, అర్చకులు రామశర్మ పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

నల్లగొండక్రైం: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం నల్లగొండ రైల్వే స్టేషన్ పరిధిలోని అన్నెపర్తి శ్రీరాంపురం రైల్వేస్టేషన్ వద్ద జరిగింది. రైల్వే ఎస్‌ఐ సాలకమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ-శ్రీరాంపురం రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు 30 ఏళ్ల వ్యక్తి మృతదేహం రైల్వే పట్టాల వద్ద పడి ఉంది. ఈ విషయమై రైల్వే పోలీసులకు సమాచారం అందటంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలిచారు. రాత్రి పూట వెళ్లిన గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడటంతో తలకు బలమైన గాయమై మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం జరిపారు. శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు పూర్తిచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి పాల్గొన్నారు.

ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ పరమేష్

మేళ్లచెరువు : ప్రియుడితో కలిసి ఓ వివాహిత భర్తను దారుణంగా హత్య చేసింది. ఈ ఘటప మేళ్లచెరువు మండల కేంద్రంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఎస్‌ఐ.పరమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేళ్లచెరువు మండలకేంద్రానికి చెందిన నెర్నకంటి వీర గోపయ్య (37)కు కోదాడ మండలం గణపవరం గ్రామానికి చెందిన వీర కుమారితో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. శనివారం రాత్రి ప్రియుడిని ఇంటికి రప్పించుకున్న కుమారి పథకం ప్రకారం భర్తను దిండుతో అదిమి ఊపిరి ఆడకుండా హత్య చేసింది. అనంతరం గుండె పోటుతో మృతి చెందినట్లు చుట్టుపక్కల వారిని నమ్మించింది. మృతుడికి అంత క్రియలు నిర్వహిస్తున్న సమయంలో మెడపై దెబ్బలు, వాపు ఉండడం గమనించిన బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఆమెను విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకుంది. మృతుడి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుమారిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మృతుడు నాగర్‌కర్నూల్ జిల్లా వాసి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు


సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు


మృతి చెందిన గోవిందు బాలయ్య

కట్టంగూర్ : ఆగిఉన్న సిమెంట్ ట్యాంకర్‌ను కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని ఎరసానిగూడెం స్టేజీ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. నాగర్‌కర్నూర్ జిల్లా బల్మూర్ మండలం గోదల్ గ్రామానికి చెందిన గోవిందు బాలయ్య(50) హైదరాబాదులోని ఎల్‌బీనగర్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ కుటుంబ సభ్యులతో జీవనం సాగిస్తున్నాడు. బాలయ్య తన కొడుకు లింగస్వామి, మనువడు నమీశ్, మనువరాలు అంకృత, తమ్ముడు కూతురు చందనతో కలిసి ఆదివారం ఉదయం హైదరాబాదు నుంచి ఎర్రవరంలో ఉన్న బాల ఉగ్రనరసింహ స్వామిని దర్శించుకునేందుకు కారులో బయలుదేరారు. మార్గమధ్యలోని ఎరసానిగూడెం స్టేజీ వద్దకు రాగానే అతివేగంతో కారు నడుపుతున్న లింగస్వామి ప్రమాదవశాత్తు అదుపుతప్పి హైవే పక్కనే డివైడర్ ఢీకొట్టి అనంతరం బస్టాప్‌లో పార్కింగ్‌లో ఉన్న సిమెంట్ ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బాలయ్య అక్కడికక్కడే మృతిచెందగా లింగస్వామి, చందన, నమీశ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామి నేని ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

కారు ఢీకొని దంపతులకు గాయాలు


గాయపడిన వృద్ధురాలు లక్ష్మమ్మ

అర్వపల్లి: సూర్యాపేట-జనగామ 365బీ జాతీయ రహదారిపై అర్వపల్లి శివారులో పెట్రోల్ బంక్ సమీపాన ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలయ్యాయి. తుంగతుర్తి మండలం తూర్పుగూడెం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు చంటి భిక్షం, అతని భార్య లక్ష్మమ్మ ఇద్దరు టీవీఎస్ మోపెడ్‌పై తుంగతుర్తి నుంచి అర్వపల్లి మీదుగా సూర్యాపేటకు వెళుతుండగా స్థానిక పెట్రోల్ బంక్ సమీపాన వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొని కిందపడ్డారు. ఈ ప్రమాదంలో లక్ష్మమ్మ తీవ్రంగా గాయపడగా భిక్షంకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలిని ఎస్‌ఐ ఇందనూరి మహేందర్‌నాథ్ సందర్శించి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా పల్లెపహాడ్ వాసి


కల్మెకొలను శ్రీనివాస్‌రెడ్డి

నార్కట్‌పల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మనగా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం పల్లెపహాడ్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు కల్మెకొలను శ్రీనివాస్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేసింది.ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం ప్రజాపక్షం దిన పత్రికకు సంపాదకులుగా వ్యవహరిస్తున్న కల్మెకొలను శ్రీనివాస్‌రెడ్డి గతంలో ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా, ఐజేయూ (ఇండియన్ జర్నలిస్టు యూనియన్) సెక్రటరీ జనరల్‌గా కూడా పని చేశారు. కల్మెకొలను అండమ్మ రాంరెడ్డి దంపతులకు ఆరుగురు సంతానంలో శ్రీనివాస్‌రెడ్డి పెద్దకుమారుడు. విద్యాభాసం పూర్తిగా నాగారం, సూర్యాపేట, హైదరాబాద్‌లోనే జరిగింది. శ్రీనివాస్‌రెడ్డికి భార్య భారతమ్మ, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడున్నారు.

శ్రీనివాస్‌రెడ్డి నియామకం పట్ల హర్షం

నల్లగొండటౌన్: ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఐజేయు అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డిని నియమించడం పట్ల టీయుడబ్ల్యూజే జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. టీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు పులిమామిడి మహేందర్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు దోటి శ్రీనివాస్, జిల్లా ఫొటో జర్నలిస్టు నాయకులు కంది భజరంగ్ ప్రసాద్, భవాని ప్రసాద్, కనకయ్య, శ్రీనివాసప్రసాద్, కారింగ్‌శ్రీను, నరేందర్‌లు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేస్తు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో జర్నలిస్టుల సమస్యలన్నింటిని పరిష్కారం అవుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

యాదాద్రిలో రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్యులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకున్నారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన ఉత్సవ మూర్తుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న రాజ్యసబ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, కుటుంబ సభ్యులకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

ముగిసిన సెపక్‌తక్రా పోటీలు



తెలంగాణ సెపక్ తక్రా 9వ సబ్ జూనియర్, జూనియర్ పోటీల్లో గెలుపొందిన నల్లగొండ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న డీఎస్‌డీఓ మక్బూల్ అహ్మద్


ట్రోఫీలతో వివిధ జిల్లా జట్ల క్రీడాకారులు

నల్లగొండ: నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో జూనియర్, సబ్ జూనియర్ అంతర్ జిల్లాల సెపక్‌తక్రా చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన పోటీలముగింపు కార్యక్రమంలో తెలంగాణ సెపక్‌తక్రా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.డి.మక్బూల్ అహ్మద్ పాల్గొని మాట్లాడారు. పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ఎస్ ఆర్ ప్రేమ్ రాజ్, పెరిక సురేష్ పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన జట్ల వివరాలు

జూనియర్ బాలుర విభాగంలో రంగారెడ్డి జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఆదిలాబాద్ జట్టు ద్వితీయ స్థానం, హైదరాబాద్-నిజామాబాద్ జట్లు సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాయి. రంగారెడ్డి జట్టుకు 3 బంగారు పతకాలు, నిజామాబాద్‌కు ఒక బంగారు పతకం, ఒక రజతం, ఒక కాంస్యం లభించింది. నల్లగొండ జట్టు ఒక రజతం, ఒక కాంస్యం సాధించింది. ఆదిలాబాద్ ఒక రజతం, ఒక కాంస్యంతో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించింది. హైదరాబాద్, వరంగల్ జట్లు చెరో రెండు కాంస్య పతకాలను సాధించగా, మహబూబ్ నగర్ ఒక రజత పతకాన్ని కైవసం చేసుకుంది.

ఐదు దశాబ్దాల తరువాత ఆత్మీయ కలయిక


రాజాపేట : గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు


ఎర్రబెల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థులు

రాజాపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1969-1970 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 54 సంవత్సరాల తరువాత ఒకే వేదికపై కలుసుకోవడంతో వారికి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. నాడు పాఠశాలలో గడిపిన మధుర స్మృతులు గుర్తుకు తెచ్చుకొని సంతోషంగా గడిపారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సమ్మేళనానికి ఆహ్వానించారు. పూర్వ విద్యార్థుల్లో ఒకరైన రిటైర్డ్ ఎంఈఓ బల్ల దామోదర్ 54 ఏళ్ల తరువాత ఒకదగ్గరకు రప్పించి ఇంతటి తీపి జ్ఞాపకాలను తిరిగి ఆస్వాదించేలా చేయడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

నిడమనూరు: వారంతా 38,39 సంవత్సరాల తర్వాత 55సంవత్సరాల వయస్సులో కలుసుకున్నారు. నిడమనూరు మండలంలోని ఎర్రబెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86, 1986-87 పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. మండలంలోని ఎర్రబెల్లి జెడ్పీ హైస్కూల్‌లో 1985-86, 1986-87 పూర్వ విద్యార్థులు పాఠశాలలో ఆదివారం నాటి గురువులకు శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నందికొండ రామేశ్వరిమట్టారెడ్డి, నాటి గురువులు రామారావు, కోటిరెడ్డి, జవ్వాజి వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, శ్రీనివాసరెడ్డి, శోభారాణి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య, లక్ష్మణ్‌రావు, నరేందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, సామల వెంకటేశ్వర్లు, సిరిగిరి శ్రీనివాసరెడ్డి, మీసాల శ్రీనివాస్, పుట్టా మధు, నారాయణ, సాంబిరెడ్డి, నందికొండ మట్టారెడ్డి, చిత్రం ప్రసాద్, ఆదిరెడ్డి, లింగారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రీశుడి దర్శనానికి మూడున్నర గంటలు


ప్రధానాలయంలో భక్తుల రద్దీ


ప్రధానాలయం వీధుల్లో భక్తుల సందడి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో పాటు మేడారం వన దేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకొని తిరుగు ప్రయాణంలో భక్తులు యాదాద్రీశుడిని దర్శించుకునేందుకు వస్తున్నారు. దీంతో ఆలయ మాడ వీధులు, క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, పాత గోశాల, తులసీ కాటేజీ, పట్టణ ప్రధాన వీధుల్లో భక్తులు అధికంగా కనిపిస్తున్నారు. భక్తులు అధికంగా వైకుంఠద్వారం నుంచి మెట్ల మార్గంలో కొండపైకి వెళ్లారు. శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంటన్నర సమ యం పట్టిందని భక్తులు తెలిపారు. యాదాద్రీశుడిని 40వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. దీంతో శ్రీస్వామి వారి నిత్యాదాయం రూ.48,96, 311 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. మేడారం నుంచి వచ్చిన భక్తులు పాత గోశాలతో పాటు ఆయా ప్రాంతాల్లో ఉన్న చెట్ల కింద వన భోజనాలు చేస్తూ కనిపించారు.